# పరిష్కృతము

★

"లసూనా"

వాకిట్లో జట్కా ఆగడంతోటే వరండాలో ఆడుకుంటున్న వేణు ఆటగూడా ఆగిపోయింది. ... చుట్టాలనేసరికి పిల్లలకు పట్టరాని సంతోషం. మిగతా బాధల సంగతి వాళ్లకెందుకు!. బండిదిగిన మనిషిని చూడ్డంతోటే బరబరా యింట్లోకి పరుగెడుతూ "అమ్మోయ్! ..... అమ్మోయ్! ... అక్కయ్య వచ్చిందే! .... " అంటూ యింటి కప్పు ఎగిరిపోయేలా కేక వేశాడు. అనసూయమ్మగారు ఆత్యాశ్చర్యంతో వాకిట్లో కొచ్చింది. తల్లిని చూచిన వరలక్ష్మి కాస్త తటపటాయించింది. మరుక్షణంలో నవ్వుముఖంతో మాట్లాడడానికేవీ లేవన్నట్లుగా లోపలికెళ్లింది. అమ్మాయి వాలకం చూచిన అనసూయమ్మగారికిది మరీ విచిత్రంగా కనిపించింది. తల్లిగనుక తనకెలాగూ తప్పదనేమో మెల్లిగా పలకరించింది. "అతగాడు రాలేదుటే!" అని .... "ఊహూ ...." అన్నదే కూతురి జవాబు ... తర్వాతి ప్రశ్న వచ్చేలోగానే సంచీలోంచి తువ్వాలు తీసుకుని కూతురు బాత్ రూమ్‌వైపుకెళ్లింది.. అనసూయమ్మకిదంతా అయోమయంగా వుంది .

పండక్కి వచ్చి పదిరోజులపాటుండి అల్లుడు కూతురు వెళ్లి అధమం పక్షంరోజులన్నా కాలేదు. ఆటుతర్వాత క్షేమసమాచారాలు వ్రాశాడు అల్లుడు. అణుయుగంలో కూడా అర్ధశతం మైళ్ల ఆదేపనిగా అరవై గంటలు ప్రయాణం చేసిన అజాబు మొన్ననే చేరింది. ఈరోజు, అమ్మాయి ఇలా ఒంటరిగా వూడిపడింది. కథేమిటో అంతు తెలీక, పొయ్యిమీది గింజలు మాడుతాయేమోననే వ్యథతో ఆమె వంటగదిలో కెళ్లింది.

వేణు అక్కయ్య తాలూకు సంచులు, సరంజామాను శల్యపరీక్ష చేస్తున్నాడు. వరలక్ష్మి రావడంతో చటుక్కున ఎక్కడివక్కడ సర్దేసి కుదురుగా కూర్చున్నాడు. ఆమె నవ్వుకుంది. వాడి బుద్ధిమంతుడితనానికి. బుగ్గలు నలిపేసింది. ముద్దులు కురిపించింది. కోరికిందేమో కూడా! కందగడ్డలా కందిపోయాయి. సంచిలోని బాక్‌లెట్ల పొట్లం వాడిచేతుల్లోకెళ్లింది. వాడిబుగ్గల ఎరుపుదనం కళ్లలో విస్తరించింది. బాధ పటాపంచలైందేమో! వేణు వరండాలో తిరిగి తన ఆట ప్రారంభించాడు. రబ్బరు బంతితోపాటువాడు గంతులేస్తున్నాడు. అరేళ్లన్నా లేని వెధవాయికి అంతకంటె మరో వ్యాసంగం ఏం వుంటుంది అనుకుంటూ వరలక్ష్మి అలా వాలుకుర్చీలో మేనువాల్చింది.

* * *

ఆమె గాథ :

అవసరం కొలదీగాని, అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారంగానీ ఆడదానికో భర్త ఉండాలన్నారు. సరే. ఆవిడ గొడవలేవీ పట్టించుకోని భర్తతో కాపురం చెయ్యడం ఎంత భారంగా వుంటుంది. అతనిలాగా ఆమెకూ, ఆశలు, అనురాగాలు, ఆశయాలు, అంటూ ఉంటాయి గదా. ముక్కునా నోటా మూడుమెతుకులు వేసుకుని ఇల్లు, ఇల్లాలి గొడవలేం పట్టకుండా ఉన్నదల్లా ఉద్యోగం అన్నట్లు ప్రవర్తించే పతులతో సతులెలా వేగుతున్నారో మరి ... పోనీ తన విషయంలోనా. అందంలో లోపం లేదు. ఆదరణలో లోటు చెయ్యలేదు. అయినా ఆతడు తనపట్ల అంత ఔదాసీన్యం వహిస్తాడెందుకో. వంటావార్పులతోబాటు, ఇంటరుదాకా తనకా చదువెందుకు సాగాలి. సాగింది పో, అనువైన సంబంధం అని అతనికెందుకియ్యాలి. ఇచ్చారు పో, యింటిగొడవే పట్టని ఇహలోక సన్యాసిగా అతనెందుకు మారాలి ... ప్రాచీన నారీమణులలాగా, భర్తే దైవం, అతడింట లేనపుడు ఆఖరికి తల్లో పూలన్నా ఉంచుకోకూడదు, బైటికి కాలు కదపకూడదు, మనసా వాచా కర్మణా మరో ధ్యాస ఉండకూడదు — యిల్లాంటి వన్నీ తనకెందుకలవడలేదు. అతనితో నాలుగు క్షణాలపాటన్నా నట్టింట నవ్వుతూ పేలుతూ ఉండాలి. అలా అతని కళ్లల్లో కళ్లుంచి ఆనందించాలి. అతనికోసం ఎంతో అందంగా అలంకరించుకోవాలి. అతని ఆనందాన్ని చూచి తానెంతగానో ఆనందించాలి. అటు తర్వాత గర్వపడాలి. ప్రకృతి, పురుషుని లాగా, అతడు తను ఐక్యమై పోవాలి. ఇలాంటి ఆశలు అహరహం తన మెదడులో ఎందుకు మెదలాలి. ఆఖరికన్నీ ఆడియాసలెందుకవాలి....

ఆ వుదయం మాత్రం తన తప్పు ఏవుంది గనుక! ... ఆ క్రితపు నెలలో అయిదు ఆది వారాలు అజాపజా లేకుండా పోయాయిగదా, ఆ ఆదివారం నాడయినా సినిమాకు తీసుకెళ్లమని అడగడం తప్పా. అర్ధాంగిగా, కనీసం, ఆడదిగా ఆమాత్రం కోరకూడదా. అందుకే ఆయన గారంతగా చిర్రుబుర్రులాడాలా. ఆరు నూరయినా ఆనాడు ఆఫీసు మూస్తారా అనే ఆయన పట్టుదల మాత్రం పొందుకూ. ఆయన బుజాల మీదుగానే అంతా సాగుతోందా. అక్కడి అకర్షణేమిటో మరి, అర్ధరాత్రి అయితేగాని ఊడిపడకపోయిరి. ఇంకాస్పైగా, అంతగా వెళ్లాలనివుంటే నీవు వెళ్లిరమ్మనడం బాగుంది. ఆయన దగ్గరలేంది ఆఖరికి వచ్చి మంచినీళ్లన్నా ముట్టుకోనని ఆమాత్రం తెలియకనే అన్నారనుకునేదా. అయినా, అమ్మయ్యో, తాను ఒంటరిగా సినిమా కెళ్లడమే. జంటలుగా వెళ్లే వాళ్లకే కంటిచూపులు వెంట తరుముతూ వుంటాయే. ఇక తనొక్కతే వెళ్లడమా. వెళ్లి అందరు మగవాళ్లు చూస్తుండగా హాల్లో కూచోవడమా. రైల్లో ఆడవాళ్ల పెట్టెల్లాగా అక్కడా ఆడవాళ్లకు ప్రత్యేకం కొన్ని తరగతులున్నా, అబ్బబ్బ వాళ్లగోల, ఆ పిల్లల ఏడుపులు అందుకోనమా తను సినిమా కెళ్లడం .. అలా కాదని పై తరగతుల్లో కూచున్నా అటూ యిటూ ఖాళీసీట్లు ఎలా వుంటాయి. పోనీ వాళ్లేమంత తెలివితక్కువ వాళ్లా. టిక్కెట్లు అమ్ముకోకుండా ఉంటారా తనకోసం. అదేల్లాగా జరిగేపని గాదు. అటూ యిటూ చూడకుండా వెళ్లి కూచున్నా అటు నుంచి సకిలింతలు, యిటు నుంచి చిరునవ్వులు ... వీటినన్నిటినీ తప్పించుకుని సినిమా చూడటం అంటే మాటలా. మరి అవకాశాలు రానంత వరకూ అందరూ పెద్దమనుషులే. ఇవేవీ ఆలోచించకుండా అలా అనడానికి ఆయనకి మాత్రం నోరెల్లావచ్చిందో. అందులో తెలిసిపోలేదూ తనపై ఆయనకున్న అనురాగం, అభిమానం!

నిజమే ఆయనగారి ఆమాట విని తను విసుక్కుంది ... "ఛీ! వెధవబతుకు! ఆరునెలలకో సినిమా చూచేందుకైనా నోచుకోని ఆడదాని అధోగతి బతుకు ... " అని. అందుకాయనకా రోష మెందుకు. అచ్చంగా అల్లాగే. విసుక్కోవాలి ఆయన గూడా. "ఛీ! వూడ్చుకుపోయిన ఉద్యోగం ఇదీ ఒక పురుషలక్షణమే! గాడిద చాకిరీ తప్పదు. గంపెడుగడ్డి మిగలదు. పుల్లలమ్ముకున్నా చల్లంగా బతకొచ్చు...." అది వెటకారంగా అన్నదికదూ.. అంటూనే ఆలా అమాంతం గడియారం చూచుకుని గడపదాటి వెళ్లడమే. అంతయిష్టం లేని నౌకరీ మానెయ్యరాదూ. మావాళ్ల నెత్తినుంచుకుని పూజిస్తారే. అందుకు మళ్లీ అభిమానం అడ్డు తగుల్తుందేం. పోనీ ఆ ఉద్యోగం నాబలవంతంమీద చేస్తున్నారా. నేను వినేలా విసుక్కునేందుకు. ఓ అరగంటలో అన్నం అవుతుందన్నా వినుకోకుండా అలా వెళ్లిపోతే ఆడదాని మనసెంత బాధపడుతుందో ఏమన్నా పట్టించుకున్నారా..... ఆ పూట ఆయన్నలా వదిలేసి తనెలా భోం చెయ్యాలి. ఏమీ తినకుండా ఎలా వుండాలి.... ఎందుకొచ్చిన బాధయిదంతా. ఎన్నటికీ ఆ రెండు ధృవాలు కలవవు. ఈరెండు హృద




'బాపూజీ' —డి. వెంకటచలం బాపూజీ (13 సం)

తూలు ఆతకవు. అంతే. అనుకుని బట్టలు సర్దుకోవడం ... బండి సమయానికందడం.. అన్నీ దైవికంగానే జరిగాయి. ఆబాధ్యత తన కేమీ గాదు.

## అతని బాధ

కట్టుకున్న మేడలన్నీ గాలికొరిగిపొయ్యాయి. పట్టుపడిసంద్రంలో చుక్కాని విరిగిన నావలా జీవితం కొట్టుకుంటోంది. ఆశలు అందని తీరాలకు అల్లల్లాగా పరుగెడుతున్నాయి. అను భవం కళ్ళెమై అడుగడుగునా వెనక్కులాగు తోంది. ఆనాడు అన్నగారి మొదలు అయిన వాళ్ళందరి సలహాలు పెడచెవిని బెట్టి ఆ ఉద్యో గంకోసం, ఆ అర్ధాంగికోసం ఆరాటపడటం యెందుకు అని యిప్పుడనిపిస్తోంది. చేతులు కాలింతర్వాత ఆకులు పట్టుకుని అల్లాడితే ప్రయోజనం ఏవుంది.

కడుపులో చల్ల కదలకుండా వారానికో పది, పదిహేను గంటలు తెలుగు ముక్కలు వాగి, నాలుగురాళ్ళు తెచ్చుకుంటూ, విశ్రాంతితో బాటు విజ్ఞానం సంపాదించుకోక యెందుకొచ్చిన ఉద్యోగం యిది. తాతయ్య ఎలిమెంటరీస్కూలు మాష్టారు. తండ్రి హైస్కూలు మాష్టారు. అన్నయ్య కాలేజీలో లెక్చెరరు. అలా అందరూ పైకేవెళ్ళారు. తనో... "ఆకాశంబున నుండి" అన్నమాదిరి అధోగతిలో ఉన్నాడు. పదిరూకల పెన్షన్‌కోసం, పదిగంటలపాటు — వారానికి కాదు, రోజుకు— కట్టుకున్న భార్యకు దూరంగా కాగితాలతో కుస్తీపట్టాలి. అప్పటికి తెమలక అర్ధరాత్రిదాకా అఘోరించాలి. అంతకూ చాలక ఇంతదస్త్రం వెంటబెట్టుక పోవాలి. అధికారి చిత్తవృత్తికి దగ్గట్టుగా ఆలోచించి రాయాలి తను. అదీ అతనికి నచ్చకపోతే అమాంతం ఓ నిలువు గీతెట్టేసినా కళ్ళప్పగించి చూడాలి. అలా .కాదు, యిలా రాయమంటానికి ఆయనకా "టైం" వుండదు. ఎలా రాస్తే అతడు తృప్తిపడతాడో ఏదేవుడూ చెప్పడు. అపరాహ్ణం దాటి, అర్జాపర్జా తీర్చుకుని, ఆయన గారు కారుతో బుర్రున వచ్చి, అయినవాళ్ళతో, అవ సరం ఉన్నవాళ్ళతో బాతాఖానీలు కొడుతూ అర్ధరాత్రిదాకా ఉన్నా అతని నిష్క్రమణ తర్వాతే తనకు విముక్తి. లేకుంటే అవిధేయత, ఆటు తర్వాత గ్రంథం. మధ్యలో పానకంలో పుడకలా ఆఫీసు మేనేజరొకడు!. తనలాంటి వాళ్ళని ఎరలని చేసి పబ్బం గడుపుకుంటాడు. తలనెరి సిన పతివ్రతలాగా అతిగా వాగుతుంటాడు. "తను ఉద్యోగంలో చేరిన మొదట్లో ..." అంటూ .. తనివిదీరని గుటకలేస్తాడు. ఆఫీ సరు పిలుపుకు అరగంట ముందే గుండెదడ ఆరంభమయ్యేదట. ఆ వినయం, ఆ వినమ్రత, అబ్బె యీనాడెక్కడున్నాయీ అంటాడు. పైగా పని తక్కువ, పరాకెక్కువట యీకాలపువాళ్ళకి. ఆడంగులూ ఉద్యోగాల కెగబడడంతో ఆకాస్త పని సున్నట. పోనిద్దూ అవన్నీ అలా వుంచి అసలు విషయం ఆలోచించుకుంటే, ఆశించిన మెరుగుల్లేవు సరికదా, అన్నిటా బరువుగానే వుంది జీవితం.

జీతపురాళ్ళకు, జీవితావసరాలకు ఏమీ పొత్తు కుదరడం లేదు. అథవా అయిదారు హెచ్చించినా, అంతకు పదిరెట్లు అన్ని ధరలూ ఎదిగేపోయాయి. పాపాలకెల్లా భైరవులన్న ట్లుగా ప్రతివాడికీ లోకువే. పై అధికారికి క్రింది ప్రజకు, ఎన్నుకున్నవాడికి, ఎన్నికైన వాడికి .. అందరికీ లోకువే ... మెత్తగా ఉంటే మొత్తబుద్ధి వేస్తుందట..

కరకరా పొద్దుపొడవక మునుపే కాసిని మెతు కులు వేసుకుని గడపదాటితే జాము పొద్దుపోతే నేగా, చచ్చీచెడీ యింటికి చేరడం ... ఆసరికే అర్ధాంగి చారెడు ముఖం, మూరెడుగా మార్చేసు కుంటుందాయె .... తెచ్చిన దస్త్రం విప్పడం లేదు. వెచ్చని కోర్కెల్ని కప్పడంలేదు. ఆ రెండు ఘడియలైనా ఆనందంగా ఉండాలను కోవడం ఆ వార వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి ఉండటం. అందులోను ఆకాస్త గండం గడిచి బైటపడితే తర్వాతమాట. అసలీ ఆఫీసు గొడ వలన్నీ ఆడవాళ్ళకేం తెలుస్తాయి. అనుభవించే వాళ్ళకి తెలియాలిగాని అలా అని ఆవిడ వూరు కుంటేనా. అయినదానికి, కానిదానికి చిరాకు పెట్టి తను బాధపడి, ఇతర్లను బాధించడం అలవాటయిపోయింది. పుట్టింట యెంత అబ్బరంగా పెరిగినా, కట్టుకున్నవాడితో కాస్త కలిసిమెలిసి ఉండాల్నా. ఎంత తెలియజెప్పినా తెగిందాకా బిగుస్తుందాయె. గట్టిగా మాట్లా డితే కళ్ళనీళ్ళెట్టుకుంటుందాయె. సరదాగా ఉండాలని తనకుమాత్రం తెలియదా.." వడిస్తె అలిసిపోతుందన్నట్లుగా తనవాళ్ళు చూచుకు న్నారట" ... అయితే తనకేం .. అంతేనా ... అబ్బె ... నలుగురి మధ్యన నవ్వుతూ, పేలుతూ ఉండేదాన్ని, ఈఏకాంతవాసంలోకి యిలా — లాక్కొచ్చి తను నిజంగానే బాధిస్తున్నాడా....

ఏమో.... అంతా అయోమయంగా వుంది అబ్బ ... అక్షణం ఎప్పుడొస్తుందో!

## అసలు కథ

వరలక్ష్మి పెంపకాన్ని గురించి అనసూయమ్మగారు అనంతరామయ్యగారితో అదివరకెన్నోసార్లు వివాదపడకపోలేదు. అయినా ఆవేళ గట్టిగానే విదిలించేసింది.

"అది వచ్చి నెలదాటింది. అతగాణ్ణి హాటలుకు వప్పజెప్పిరావడం ఎందుకో తెలియడం లేదు. అడిగితే సమాధానం చెప్పదు. అతగాడేమో జాబన్నా రాయడు. ఇదేం అయోమయమంట. అసలు దానికిన్నిరాళ్లు తెచ్చింది మీరేగా.. "

"అవున్లే! చాల్లెద్దూ.. అంతకుమించి మరోటి రాదుగా నీనోట. ఏదో చిన్నతనం ఏవన్నా మాటపట్టింపులొచ్చి చక్కా వచ్చేసిందేమో .. అయినా అతనికి మాత్రం బుద్ధి ఉండనక్కర్లే. ఎంతో గారాబంగా పెరిగిందయ్యా అని ఎన్నిసార్లు చెప్పాం. బుద్ధిమంతుడనుకున్నందుకు బాగానే ఉంది...."

"మన బంగారం మంచిదైతే మరొకర్ని అనుకోవడం దేనికి. కట్టుకున్న వాణ్ణి వదిలి పుట్టింట్లో యేన్నాళ్లని యిలా వుంటుందేవిటి? అయినవాళ్లంతా అలాగే కాపరాలు జేస్తున్నారు గామోసు. మీదంతా విడ్డూర్యంగాని."

"చాల్లే! నోర్ముయ్! ఎవరన్నా వినిపోయేను. అదేమన్నా పరాయిపంచనుందా. అలా అఘోరిస్తావ్. నాకూతురు నాయింటికొస్తే ఎవడు వేలెత్తి చూపుతాడని. అమ్మాయి కావలసి వుంటే అతగాడే వస్తాడు."

"అయ్యో నా రాత! అలా అని కూచుంటే ఎలాగండీ! .. అసలు సంగతేవిటో తెలుసుకోవాల్నా.. పోనీ ... అక్కడికోమారు వెళ్లిరాగూడదుటండీ...."

* * *

అనంతరామయ్య గారేమీ సమాధానం చెప్పకపోయేసరికి, ఆవిడ ముక్కుమీద వేలేసుకుని, ఒక్కసారి మూతివిరిచి విసవిసా లోపలికెళ్లిపోయింది. ఆయన తాపీగా చుట్టతీసి వెలిగించుకొని ఏదో ఆలోచిస్తున్నాడు. అంతవరకూ వాళ్ల సంభాషణ నేపథ్యంలో వింటున్న వరలక్ష్మి ఏమీ ఎరగనట్టు వచ్చి, పుస్తకాల బీరువాలోంచి ఒక పుస్తకంతీసి పేజీలు తిప్పుతూ కూచుంది. తండ్రి తనవైపే దీక్షగా ఒకటి రెండు సార్లు చూచినా, తానది గమనించనట్లు తన పనిలో నిమగ్నమైంది.

"అమ్మాయ్! అమ్మను త్వరగా వంటచెయ్యమనిచెప్పి, ఆసంచీలో ఒకజత బట్టలు పెట్టేసెయ్. బొపట్ల వెళ్లాలి .." అంటూ అనంతరామయ్య గదిలోంచి లేచివెళ్లి ఆరు బయట పచార్లు చేస్తున్నాడు. కుండీలలో రకరకాల పూలమొక్కలు చల్లగాలికి కితకితలాడుతున్నాయి. అప్పుడే విచ్చుకుంటున్న సందెమల్లెలను చూచే

> క్రొత్త నెక్లెస్ పెట్టుకున్న తల్లిని చూస్తూ నుంచున్న ఎనిమిదేళ్ళ అమ్మాయితో ప్రక్కింటావిడ:
> ఏమమ్మా! మా అమ్మ నెక్లెసులాంటిది నువ్వు కూడా చేయించుకో లేకపోయావా?
> అమ్మాయి: ఆఁ, మా అమ్మకైతే మొగుడున్నాడు కాబట్టి చెయ్యించాడు, నానాకెవరున్నారు చెయ్యించటానికి?

సరికి ఆయనకు సంతోషం కలిగింది గాబోలు, ఆప్యాయతగా ఆ మొగ్గవైపే చూస్తూ చుట్ట పొగ వదుల్తున్నాడు.

* * *

అనంతరామయ్య రైలు దిగి నేరుగా అల్లుడియింటికే వెళ్లాలనుకున్నాడు. మరుసటి రోజు గూడ అక్కడ కోర్టులో పని ఉండటంవల్ల, తాపీగా అల్లుడి విషయం కనుక్కుని అంతా చక్కబెట్టవచ్చనుకున్నాడు. పట్టుమని నడిస్తే పదిబారలు లేని భాగ్యానికి మళ్లీ బండి యెందుకా అని తటపటాయిస్తున్నాడు. పెట్టె, బెడ్డింగు పుచ్చుకుని మూర్తి అకస్మాత్తుగా ఓ బండ్లోనుంచి దిగడం చూశాడు.

"ఎందాకా ఏవిటి?" అన్న మామగారి ప్రశ్న, "ఇంటి నుంచేనా రావడం?" అన్న అల్లుడిప్రశ్న ఒకదానికొకటి ఎదురైనాయి.

"ఒక నెలరోజులు సెలవుపెట్టాను. విజయవాడకే బయలుదేరాను. ఆఁ వేణా అంతా కులాసా?" అన్నాడు మూర్తి.

"ఊఁ ... కులాసాయే. అది సరేనయ్యా .. అమ్మాయి వచ్చేసి నెలపైగా అయిందిగదా జాబుముక్క రాయడానికే తీరుబడిలేని ఉద్యోగం చేస్తున్నావేమిటి?"

"చెప్పకుండా, చెయ్యకుండా వెళ్లొచ్చేస్తే ఏ అడ్రసుకు వ్రాయాలో తెలీక వూరుకున్నాను. మరేం చెయ్యమంటారు."

అనంతరామయ్య అల్లుడేం తీసిపోలేదు. అనుభవజ్ఞుడు గనుక వెంటనే పసిగట్టాడు. ఏదో గొడవ జరిగి ఉండొచ్చని. ఆవిషయమేమిటో అమ్మాయి దగ్గర్నుంచి ఆరా తీయాలని తన భార్య ప్రయత్నించి ఫలితం పొందలేక పోయిందన్న విషయం అప్పుడు గుర్తుకొచ్చింది. నిజానికి తనుగూడా వరలక్ష్మి నేమీ అడగలేదు. అడగడం అలవాటు లేదు కూడాను. పిల్లలకు సంబంధించిన ప్రతివిషయంలోను తానంత జోక్యం కలిగించుకోడు. వరలక్ష్మి అయినా మరీ పాలు తాగే పసిపిల్లకాదు. చదువుకున్నది, చురుకయినది, దాని మంచీచెడూ దానికి తెలీదేవిటి. పెంచిన పెద్దవాళ్లం అని అన్నిటా హద్దులు గీయడం తనకు మతరామూ ఇష్టం లేదు. పాతకాలపు మనిషి భార్యకు తనకు అక్కడే పడదు. అసలు విషయం ఏవిటని అక్కడ కదపడం బాగుండదని అనంతరామయ్య లౌక్యంగా తప్పుకునేలా "అయినవాళ్ల అడ్రసులుకూడా మరిచిపోయేటంత మహా ఉద్యోగం చేస్తున్నావన్నమాట..." అంటూ దాటేద్దామనుకున్నాడు.

"ఏవిటో లెండి! ... అభావం లేకపోతే ఏ పనీ చెయ్యలేం. అయినా, ఇదుగో అదుగో అనుకుంటూనే అలారోజులు గడిచిపోయాయి. సర్వీసులోవుండే చిక్కులు మీకు తెలియనివా. ఆ "ప్రొబేషన్" కాస్తా అయిందనిపించుకుంటే మరేమీ బాధ ఉండదు. అందులోను మా మేనేజరు మహా అసాధ్యుడు. అణిగి మణిగి ఉండలేదని అవిధేయత జూపించారంటూ "ప్రొబేషన్" పొడిగిస్తే అదీ ఒక బాధేగా...."

"అవుననుకో. ... అయినా, ఓ జాబుముక్క రాయిగూడదుటోయ్ .... " అసలీ కాలపు వాళ్లతో వచ్చిన గొడవిదే .... వాళ్లవిషయమే వాళ్లకుగాని, ఎదుటివాళ్ల గొడవేమిటో ఏవీ ఆలోచించరు. ఏడుపుతీపి తెలిస్తేనేగాని యీ గడబిడలు పోవులే. అయితే వ్యవహారంలో మరేం చిక్కులు లేవంటావ్. మంచిదే. ఊఁ... సరే అవతల బండి వేళయినట్టుంది. పద మరి ...కోర్టు పని కాస్తవుంది, అది చూచుకుని రేపు సాయంత్రం బండికొస్తాను నేను."

"అలా అయితే నేనూ ఆగిపోతాను........ రేపే వెడదాం లెండి ...."

"సాగిన ప్రయాణం మళ్లీ ఆగడం దేనికి.. నీవు ముందు వెడుదూ. నేను రేపు సాయంత్రం బండి కొచ్చేస్తానుగా..."అంటూ అల్లుణ్ణి ఆరైలుకే పంపించేసి, అనంతరామయ్య ఒక వ్యవహారం పరిష్కారమైపోగా, రెండో దాని గొడవలో పడిపొయ్యాడు.

★


## దగ్గు నివారిణి

తిరగపెట్టకుండా దగ్గును యిప్పుడే నిర్మూలించండి. ఖరీదు రు. 157—15. ట్రయల్ 12—13.

## చెవుడు

పూర్తి కోర్సు ద్వారా చెవుడు పూర్తిగా నయమగును. పూర్తి కోర్సు రు. 147—15. ట్రయల్ రు. 17—97న.పై. జాబులు యింగ్లీషులో వ్రాయండి.

**DR. SHERMAN,**
181, R. N. Guha Road, Calcutta-28.